సాక్షి
జనగామ

శుక్రవారం । 23 । జూన్ । 2023



చేసేందుకా.. కాజేసేందుకా?
ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ పనులు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. నీటి ప్రవాహం పేరిట కాంట్రాక్టర్లు కాలయాపన చేస్తున్నారు. - 8లో▸



రైతులకు పరిహారం ఇవ్వలే..
ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పైసా పరిహారం చెల్లించలేదని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు కాస్త తగ్గుతాయి.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జ్ డీఐఈఓగా మంజుల



జనగామ రూరల్: జిల్లా ఇంటర్ విద్యాధికారి బైరి శ్రీనివాస్ అమెరికా పర్యటనకు వెళ్లిన నేపథ్యంలో బాలికల జూనియర్ ప్రిన్సిపాల్ మంజుల గురువారం ఇన్‌చార్జ్ డీఐఈఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఆమెను పలువురు ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు అభినందించారు.

బచ్చన్నపేట ఎస్సై సస్పెన్షన్

బచ్చన్నపేట: బచ్చన్నపేట ఎస్సై నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య కిడ్నాప్ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా విధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆయనను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. అంతే కాకుండా గతంలో నమోదైన కేసుల్లో దర్యాప్తు విషయంలో అలసత్వం వహించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

'బడి' పనులు వెంటనే పూర్తి చేయాలి




జనగామ రూరల్: 'మనఊరు–మనబడి' కింద ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన పనులు వెంటనే పూర్తి చేయాలని న్యాయవాది సాధిక్ అలీ అన్నారు. గురువారం సోషల్ డెమోక్రటిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రీతి, సాధిక్ అలీ కలిసి జిల్లా కేంద్రం స్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. వారు మాట్లాడుతూ.. స్కూల్‌లో రూ.52 లక్షల వ్యయంతో చేపట్టిన భోజన వసతి గృహం పనులు నత్తనడకన సాగుతున్నాయని, అన్ని కాంట్రాక్ట్ పనులు ఒక్కరికే ఇవ్వడం వల్ల ఆలస్యమవుతున్నట్లు పేరెంట్స్ కమిటీ బాధ్యులు చెప్పారని పేర్కొన్నారు. పాఠశాల భూమిలో జూనియర్ కళాశాల నిర్మించడంతో ఆట స్థలం లేకుండా పోయిందన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న ఈ పాఠశాలకు నాలుగు గదులే కేటాయించారని తెలిపారు.

రేపు జాబ్ మేళా

జనగామ రూరల్: వరుణ్ మోటర్ ప్రైవేట్ కంపెనీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 24న నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి ఒక ప్రకటనలో తెలిపారు. పిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులు చేసిన వారికి ఉద్యోగాలు ఉన్నాయని, అర్హులు ధ్రువీకరణ పత్రాలతో కలెక్టరేట్‌లోని సెకండ్ ఫ్లోర్ రూం నంబర్ ఎస్–29కు రావాలని సూచించారు.

చైర్‌పర్సన్‌కు సత్కారం



జనగామ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హరిత హారంలో జనగామ మున్సిపాలిటీ రాష్ట్ర స్థాయి మొదటి స్థానంలో నిలిచి అవార్డు అందుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, కమిషనర్ రజితను గురువారం శానిటేషన్ అవుట్ సోర్సింగ్ యూనియన్ కార్మికులు సత్కరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు గంధమల మల్లేష్, తిపారావు ప్రసాద్, కొయ్యడ వెంకటస్వామి, ప్రవీణ్, నాగిళ్ల నాగరాజు, రొడ్డ కృష్ణ, తాళ్లపల్లి ఎల్లేష్, వాతల యాదగిరి, షాడ రాజు పాల్గొన్నారు.

క్రికెట్ పంచాయితీ



జనగామ: పట్టణ పరిధి బతుకమ్మ కుంటలో గురువారం సాయంత్రం వాకర్లకు క్రికెట్ బాల్ తగలడంతో మరోసారి పంచాయితీ తలెత్తింది. కుంట చుట్టూ వందలాది మంది వాకింగ్ చేస్తుండగా.. కొంతమంది పిల్లలు మైదానంలో క్రికెట్ ఆడారు. ఈ క్రమంలో ఓ వృద్ధుడికి క్రికెట్ బాల్ తగలడంతో ఇదేంటని ప్రశ్నించారు. దీంతో పిల్లలు వృద్ధుడిని దబాయించడంతో మిగతా వాకర్లు కలుగ జేసుకున్నారు. దీంతో వారు కాసింత వెనక్కి తగ్గారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటన రెండోసారి కావడంతో వాకర్లు భయాందోళనకు గురవుతున్నారు.

'బడిబాట' బాగు

- ప్రభుత్వ పాఠశాలల్లో 4,532 అడ్మిషన్లు
- అత్యధికంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చినవే..
- ముగిసిన ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' కార్యక్రమం
- 15 రోజులు ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం
- ఈనెల చివరి వరకు ప్రవేశాలు



'బడిబాట' ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు(ఫైల్)

జనగామ రూరల్: వేసవి సెలవుల అనంతరం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. విద్యాశాఖ సూచన మేరకు ఈనెల 3వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఆహ్లాదకర వాతావరణం కనిపించేలా అన్ని హంగులతో పాఠశాలలను సిద్ధం చేసి 'బడిబాట' మొదలుపెట్టారు. ఉపాధ్యాయుల కృషితో 4,532 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. అత్యధికంగా పాలకుర్తి పరిధిలో 1,419 అడ్మిషన్లు వచ్చాయి. ఈ కార్యక్రమం కింద గత ఏడాది 3వేలకు పైగా విద్యార్థులు సర్కారు స్కూళ్లలో ప్రవేశం పొందారు.

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల కారణంగా ప్రభుత్వ విద్యావ్యవస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణ సర్కారు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విశేషంగా కృషి చేస్తోంది. ఈ మేరకు విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేలా 'బడిబాట' కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 17 రోజుల పాటు ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. సర్కారు స్కూళ్లలో కల్పించే సౌకర్యాలు వివరించారు.

ఆంగ్ల బోధనపై ప్రత్యేక ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం బోధన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయులు 'బడిబాట' కార్యక్రమంలో ఈ అంశంతోపాటు కల్పిస్తున్న వసతులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన, మధ్యాహ్నభోజన పథకం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం తదితర అంశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

వసతుల కల్పనపై..

'మనఊరు–మనబడి' కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రభుత్వం, దాతల సహకారంతో వసతుల కల్పనకు చేపట్టిన పనులు కొన్నింటిలో పూర్తికాగా.. మరి కొన్ని స్కూళ్లలో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, అదనపు గదులు, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్ తదితర వసతులతో కార్పొరేట్‌స్థాయి విద్యాబోధన గురించి ప్రత్యేకంగా వివరించారు.

బడీడు పిల్లలను గుర్తించి..

'బడిబాట' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతి ఇంటికి వెళ్లి బడి మధ్యలో మానేసిన పిల్లలను, బాల కార్మికులను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా కృషి చేశారు. ప్రీప్రైమరీలో 119, 1వ తరగతిలో ప్రైవేట్ నుంచి 250, అంగన్‌వాడీల ద్వారా 1,458, డైరెక్ట్ అడ్మిషన్‌తో 230 మంది, 2 నుంచి 10వ తరగతి వరకు సుమారు 2,594 మంది అడ్మిషన్లు పొందారు. ఈనెల చివరి వరకు ప్రక్రియ కొనసాగనుండగా.. మరిన్ని అడ్మిషన్లు వచ్చే అవకాశం ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ప్రొఫెసర్ జయశంకర్ 'బడిబాట' కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాల్లో విజయవంతంగా నిర్వహించాం. గత ఏడాది కంటే ఈసారి అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. మొత్తం 4,532 మంది చేరగా.. ఎక్కువగా ప్రైవేట్ స్కూళ్లలో చదివే వారు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఈనెల చివరి వరకు ప్రవేశాలకు అవకాశం ఉంది. మరిన్ని అడ్మిషన్లు పెరుగుతాయి. బడీడు పిల్లలను స్కూళ్లలో చేర్పించాలి.

– కె.రాము, డీఈఓ

బడిబాట కార్యక్రమంలో మండలాల వారీగా వచ్చిన అడ్మిషన్లు

బచ్చన్నపేట	చిల్పూరు	దేవరుప్పుల	స్టేషన్‌ఘన్‌పూర్	జనగామ	కొడకండ్ల
195	331	319	503	514	117
లింగాలఘణపురం	**నర్మెట**	**పాలకుర్తి**	**రఘునాథపల్లి**	**తరిగొప్పుల**	**జఫర్‌గఢ్**
156	161	1,419	369	142	306

ప్రజల ముంగిట ఆర్టీసీ సేవలు

- జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న



విద్యార్థులకు బస్‌పాస్‌లు అందిస్తున్న డీఎం

దేవరుప్పుల: లాభాపేక్ష లేకుండా ప్రజల ముంగిట ఆర్టీసీ సేవలు కొనసాగిస్తున్నట్లు ఆ సంస్థ జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న అన్నారు. గురువారం స్థానిక బాలయేసు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ బాలికలకు ఆర్టీసీ ఉచిత బస్ పాస్‌లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సేవలు అందించే క్రమంలో ప్రయాణికుల ఆదరణ ఉంటేనే సర్వీసులు కొనసాగించగలుగుతామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణికులతో పాటు ట్రాన్స్‌పోర్టు సేవలందిస్తున్న ఆర్టీసీని పరిరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు, ఉపాధ్యాయులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రామకృష్ణయ్య హత్యకు ఎమ్మెల్యే బాధ్యత వహించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నరేష్, తదితరులు

జనగామ: రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యకు ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నైతికంగా బాధ్యత వహించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ అన్నారు. హత్యను నిరసిస్తూ గురువారం జనగామ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పైస రాజశేఖర్ అధ్యక్షత జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రామకృష్ణయ్య హత్య వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని, నిందితుడికి అధికారి పార్టీ అండతోపాటు గతంలో నేర చరిత్ర ఉందన్నారు. పోలీసుల నిర్లక్ష్యం దారుణ హత్యకు దారి తీసిందని చెప్పారు. ముత్తిరెడ్డి ఎమ్మెల్యే అయిన తరువాత జనగామ జిల్లా భూమాఫియా, తగాదాలు, హత్యలకు అడ్డగా మారిందన్నారు. అన్యాయాలు, అక్రమాలను వెలికితీస్తున్న రామకృష్ణయ్యను గిరబోయిన అంజయ్య ఎమ్మెల్యే అండతోనే హత్య చేయించాడని అన్నారు. అంజయ్య భార్య భాగ్యలక్ష్మిని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగించాలని, ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన ఎస్సైని సస్పెండ్ చేసిన మాదిరిగా సీఐని కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సిట్టింగ్ జడ్జి చేత హత్య కేసును విచారణ వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగల్ల ఉపేందర్, ఇనుముల నర్సయ్య, తాళ్లపల్లి కుమార్, గుర్రం శాంసన్, భాస్కర్, నర్సింగరావు, సుధాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు పరామర్శ

బచ్చన్నపేట : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ పోచన్నపేటలో రామకృష్ణయ్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

గోవధను నిషేధించండి

లింగాలఘణపురం: బక్రీద్ పండుగ సందర్భంగా చట్టవిరుద్ధంగా సాగుతున్న గోవధను నెలరోజుల ముందుగానే నిషేధించాలని మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. గురువారం పటేల్‌గూడెంలో బహుజన గోశాల లింగాలఘణపురం అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యాన జరిగిన సమావేశంలో మాట్లాడారు. గోవధకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. అక్రమంగా పశువుల వ్యాపారం చేస్తున్న వారిపై బైండోవర్ కేసులు పెట్టాలన్నారు. ఎనిమల్ వెల్ఫేర్ బోర్డ్ మెంబర్ కమలేష్ దాస్ మహరాజ్, గోశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజయ్యను సస్పెండ్ చేయాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందిర



కేసీఆర్ దిష్టిబొమ్మపై పెట్రోలు పోస్తున్న ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు ప్రజలకు పలు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని విస్మరించిన సీఎం కేసీఆర్.. చిత్తశుద్ధి ఉంటే అవినీతి ఆరోపణలు, మహిళపై వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే రాజయ్యను తక్షణమే సస్పెండ్ చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపుమేరకు 'తెలంగాణ దశాబ్ది ఉత్సవాల దగా' పేరుతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. స్థానిక బస్టాండ్ సమీపాన అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఇందిర మాట్లాడుతూ.. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించిన ఆమె.. పదేళ్ల పాలనలో రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని అన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి లకావత్ ధన్వంతి, పార్టీ నాయకులు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, కీసర దిలీప్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, ఐలపాక శ్రీను, కోరుకొప్పుల మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో దగా..

కాంగ్రెస్ ఆధ్వర్యంలో
సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం



పొన్నాల వర్గం ఆధ్వర్యంలో నిరసన



కొమ్మూరి వర్గం ఆధ్వర్యంలో..

జనగామ: బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలతో ప్రజలను దగా చేస్తోందని నిరసిస్తూ టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల వర్గీయులు గురువారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్ కొట్ల శ్రీనివాస్, ఇన్‌చార్జ్ చెంచారపు శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరకృష్ణ స్వామి ఆధ్వర్యంలో నెహ్రూపార్కు నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కార్యక్రమంలో నర్సయ్య, కొమ్ము రవి, కొన్నె మహేందర్ రెడ్డి, గురువయ్య, జంగిటి అంజయ్య, వెంకట్‌రెడ్డి, వంగళ కళ్యాణిమల్లారెడ్డి, జక్కుల వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మూరి వర్గం ఆధ్వర్యంలో..

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్దారెడ్డి, వంగాల మల్లారెడ్డి, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, ఆలేటి సిద్దిరాములు, చేన్నోజు విజయలక్ష్మి, పిట్టల సతీష్, బండారు శ్రీనివాస్, జాయ మల్లేష్, కోటా నాయక్, అర్షద్ రహమాన్, దాసరి క్రాంతి, గందమల్ల కమలాకర్, పిడుగు రమేష్, బిర్రు సత్యనారాయణ, మోటే మల్లేష్, తాటి కనుక స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమ్మె అనివార్యం

- టీజీపీడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న



దేవరుప్పల ఎంపీడీఓకు సమ్మెనోటీసు అందిస్తున్న జీపీ కార్మికులు

దేవరుప్పుల : అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం సమ్మె అనివార్యమైందని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న అన్నారు. ఈ మేరకు జూలై 6 నుంచి తలపెట్టిన పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసును గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ టి.సురేష్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వస్తే బతుకులు మారుతాయనుకుంటే.. మల్టీపర్పస్ విధానంతో కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమను పర్మనెంట్ చేయడంతోపాటు పీఆర్సీ, ప్రమాదబీమా వర్తింపజేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో నాయకులు బస్వ రామచంద్రు, ఎడవెలి వెంకట్‌రెడ్డి, సీహెచ్.స్వరూప తదితరులు పాల్గొన్నారు.

త్యాగాల ఫలితమే తెలంగాణ

- కేసీఆర్ తెగింపు.. శ్రీకాంతాచారి త్యాగం
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- దశాబ్ది ఉత్సవాల్లో అమరులకు నివాళి



జనగామ: అమరుల కుటుంబాలను సత్కరిస్తున్న మంత్రి దయాకర్‌రావు, కలెక్టర్



జనగామ : అమరుల స్తూపం వద్ద మంత్రి, కలెక్టర్, అధికారులు, జెడ్పీ చైర్మన్



గొల్లపల్లిలో అమరుల స్మారక చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

జనగామ: త్యాగాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది.. స్వరాష్ట్ర ఉద్యమంలో కేసీఆర్ తెగింపు.. మలి విడత మొదటి అమరుడు శ్రీకాంతాచారి ఆత్మత్యాగం ఫలితమే నేటి బంగారు తెలంగాణ పురుడు పోసుకుందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో గురువారం అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ శివలింగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. 70 ఏళ్లలో జరగని అభివృద్ధి ఒక్క కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసి చూపించారని, కాంగ్రెస్, బీజేపీ మూర్ఖులు బంగారు తెలంగాణను చూసి ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. నాడు దేశానికి గాంధీ మహాత్ముడు స్వాతంత్య్రం తీసుకువస్తే, నేడు తెలంగాణను కేసీఆర్ తెచ్చారని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో బీజేపీ నుంచి దింగత నేత సుష్మాస్వరాజ్ ఒక్కరే మద్దతు పలికారని గుర్తు చేశారు. తొలి, మలి దశ ఉద్యమాల్లో 1,600 మంది అమాయకులను పొట్టన బెట్టుకున్న తర్వాత ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ ఉద్యమ అమరుల కుటుంబాలకు ఇప్పటికే ఉద్యోగాలు ఇప్పించామని, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. 'దళిత బంధు', గృహలక్ష్మి, రూ.లక్ష.. స్కీంలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్‌ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ అమరులు శ్రీకాంతాచారి, పొన్నం అశోక్, పాశం ప్రకాశం, శ్రీమంతోజు రామలింగాచారి, దేవరాయ సారంగపాని, గడప నర్సయ్య, డింగరి రాము, ముత్తినేని శ్రీనివాస్, ఎం.శ్యాంకుమార్, సంబరి నవీన్, చెరుకు అంజయ్య, లునవత్ బోజ్యానాయక్, బైరగోని యాకయ్య, వంగాల రాజు, సామరి రాజమౌళి, బి.కొమురెడ్డి, లకావత్ సురేష్ కుటుంబాలను సత్కరించారు. అంతకు ముందు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పి.సంపత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీపీ పి.సీతారాం, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, రోహిత్ సింగ్, అమరుడు శ్రీకాంతాచారి తండ్రి దాసోజు వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధించుకుని తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో ఏట అడుగిడిన వేళ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన దశాబ్ది ఉత్సవాలు జిల్లాలో విజయవంతంగా ముగిసాయి.


అమరుల స్మారక చిహ్నం ప్రారంభం

దేవరుప్పుల: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం గొల్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కాసోజు శ్రీకాంతాచారి స్మారక విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం మండల పరిషత్ వద్ద ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషం, జెడ్పీటీసీ పల్ల భార్గవిసుందర్‌రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన అమరుల స్మారక చిహ్నాన్ని మంత్రి దయాకర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలకంగా పనిచేసిన వారందరినీ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు కాసోజు వెంకటాచారి, వైఎస్ ఎంపీపీ విజయ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షురాలు గొడుగు సుజాతమల్లికార్జున్, సర్పంచ్‌లు ఈదునూరి రమాదేవి, బిల్లా అంజమ్మ, ఎంపీటీసీ తోటకూరి రేణుక, రైతు బంధు కోఆర్డినేటర్ నర్సింహారెడ్డి, దయాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులు

కేయూ క్యాంపస్: కేయూలోని ఇంజనీరింగ్ విద్యార్థులు ముగ్గురు తెలంగాణ రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.మల్లారెడ్డి గురువారం తెలిపారు. కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు లుక్క స్నేహిత, మాలోతు నవత, మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి తేజశ్రీ ఇందులో ఉన్నారు. ఈనెల 20న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన విద్యా దినోత్సవ వేడుకల్లో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య లింబాద్రి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు. వీరు సర్టిఫికెట్లు, ఒక్కొక్కరు రూ.10 వేల చెక్కులు కూడా అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థులను వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు అభినందించారు.

సింగరేణిని ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు



బహిరంగ సభలో మాట్లాడుతున్న బండి సంజయ్



సభకు హాజరైన పార్టీ కార్యకర్తలు, ప్రజలు

- భూపాలపల్లి సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

భూపాలపల్లి/భూపాలపల్లి రూరల్: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ప్రస్తుతం జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.. సంస్థను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు.. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక పాత బకాయిలు మొత్తం చెల్లించి పరిరక్షిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ఆ పార్టీ చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం భూపాలపల్లి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో బండి సంజయ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ తన కూతురిని యూనియన్ నాయకురాలిని చేసి సంస్థను ఏటీఎంలా వాడుకుంటున్నారని ఆరోపించారు. ఓపెన్‌కాస్ట్‌లను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ఇవ్వాల 17 ఓపెన్‌కాస్ట్‌లకు అనుమతి తీసుకున్నాడన్నారు. సింగరేణి నుంచి రూ. 25 వేల కోట్ల అప్పు ప్రభుత్వం తీసుకుందని, సంస్థను దివాలా తీయించేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నందుకు, ప్రజలను దారి మళ్లించేందుకు పీఎం మోదీ తనకు దోస్త్ అని సీఎం ప్రచారం చేసుకుంటున్నాడని అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఉచిత వైద్యం, విద్య, ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని సంజయ్ హామీ ఇచ్చారు. సభలో రిటైర్డ్ డీజీపీ కృష్ణప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు కీర్తిరెడ్డి, రాకేష్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు ఉదయ్ ప్రతాప్, సునీల్‌రెడ్డి, పాపయ్య, రాజుగౌడ్, గణపతి, మునీందర్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

తాత్కాలిక పద్ధతిలో నియామకాలు

విద్యారణ్యపురి : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో విద్యాబోధనకు తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపడుతున్నట్లు ఆ బీసీ గురుకులాల ఆర్‌సీవో వై మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆంగ్లమాధ్యమంలో విద్యబోధన చేయాల్సి ఉంటుందన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులో విద్యాబోధన చేయాల్సింటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత విద్యార్హతల సర్టిఫికెట్లతో హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్‌లోని బీసీ గురుకుల పాఠశాలలో డెమో, ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఈనెల 26న తెలుగు, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టులకు, 27న సైన్స్, ఇంగ్లిష్ ,హిందీ సబ్జెక్టులకు హాజరుకావాలన్నారు. వివరాలకు 9154102639, 9550064323 నంబర్లను సంప్రదించాలన్నారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ తోపాటు బీఈడీ కలిగి ఉండాలన్నారు.

రిటైర్డ్ ఎంపీడీఓ హత్యపై విచారణ..?

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై పోలీసులు పలువురిని విచారిస్తున్నారు. గురువారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాలకు చెందిన దాదాపు 40 మందిని స్టేషన్‌కు తీసుకొచ్చి వారి కాల్ డేటాతోపాటు పలు వివరాలు సేకరించారు. కాగా, రామకృష్ణయ్యను గిరబోయిన అంజయ్య ఈనెల 15న హత్య చేయించిన విషయం పోలీసుల విచారణలో వెల్లడైంది తెలిసిందే. అదే రోజు జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి ఇంటి ఎదుట పలువురు సంబురాలు జరుపుకున్న అనంతరం విందు ఏర్పాటు చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ విందులో పాల్గొన్న వారిని స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు.. సంబురాలు ఎందుకు చేసుకున్నారనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకేమీ తెలియదని చెబుతున్నారు.

ఆరేళ్ల తర్వాత హడావుడిగా చేపట్టిన హనుమకొండ పెగడపల్లి డబ్బాల సమీపంలో కాకతీయ ప్రధాన కాల్వల ఆధునీకరణ పనులు



ఆరేళ్ల కిందట రూ.873.61 కోట్లు..

ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ కోసం 2017లో 83 పనుల కోసం రూ.873.61 కోట్లు జీఓఎంఎస్ 67 ద్వారా ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిర్మల్ జిల్లా పోచంపాడు నుంచి (0.000 కి.మీ.ల నుంచి 284.000 కి.మీ.ల) ఖమ్మం జిల్లా తీర్థాల వరకు ప్రధాన కాల్వల ఆధునికీకరణతోపాటు లక్ష్మీ కెనాల్, సరస్వతి కెనాల్, సదర్మాట్‌ల మెయింటనెన్స్ పనులకు నిధులిచ్చారు. ప్రధానంగా కాకతీయ ప్రధాన కాల్వ ఏడు పనుల కోసం రూ.385.56 కోట్లు, 63 డిస్ట్రిబ్యూటరీల కోసం రూ.356.14 కోట్లు కేటాయించారు. ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ.873.61 కోట్లలో రూ.741.70 కోట్లు ప్రధాన కాల్వల ఆధునికీరణకు ఇచ్చారు. ఈ పనులకు 2018లో టెండర్లు జరగగా, వరంగల్, హైదరాబాద్‌లకు చెందిన ప్రముఖ కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన కొందరు కీలక ప్రజాప్రతినిధులు అసలు కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేసి వారి బినామీ కాంట్రాక్టర్లకు సబ్ కాంట్రాక్ట్‌కింద పనులు కట్టబెట్టారు. ఏడాదిలో పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా.. సాగదీస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చేసేందుకా... కాజేసేందుకా?

ఆరేళ్లుగా పెండింగ్‌లో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ

- రూ.873.61 కోట్లతో 83 పనులు.. 2018లో పూర్తయిన టెండర్లు
- కాల్వల్లో నీటి ప్రవాహం పేరిట కాలయాపన....
- హడావుడిగా రూ.122.90 కోట్ల పనులు మొదలెట్టిన కాంట్రాక్టర్లు
- మళ్లీ వర్షాలు పడే ముందు మొదలెట్టడంపై అనుమానాలు
- ఫలహారంగా కాకతీయ కాల్వల ఆధునికీకరణ నిధులు
- గతంలో డీబీఎం 38, 48 పనుల్లో అక్రమాలు.. సొంతశాఖ నుంచే ఫిర్యాదులు..
- ఇంకా కొనసాగుతున్న 'విజిలెన్స్'విచారణ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్–1 కాకతీయ ప్రధాన కాలువల ఆధునికీకరణ నిధులు కొందరు అధికారుల, కాంట్రాక్టర్లకు ఫలహారంగా మారాయి. ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా సాగునీటి ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం, ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తోంది. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కు కావడం వల్ల నిధులు దుర్వినియోగం అవుతుండడంతోపాటు ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

సాక్షిప్రతినిధి, వరంగల్:

వరంగల్ జిల్లా నర్సంపేట డివిజన్ గీసుకొండ, పర్వతగిరి ప్రాంతాల్లో డీబీఎం–38, డీబీఎం–48లలో జరిగిన పనుల్లో భారీగా అక్రమాలు జరిగాయి. సుమారు రూ.100 కోట్ల పనుల్లో 25 శాతం వరకు పనులు చేయకుండానే నిధులు డ్రా చేశారన్న ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఆ తర్వాత మిగతా పనులు కూడా నిలిపి వేశారు. జగిత్యాల ఏరియాలో రూ.51.16 కోట్లు, ఎల్ఎండీ పైన రూ.32.24 కోట్లతో పనులు పూర్తి కాగా, ఎల్ఎండీపరిధిలోని 146 కి.మీ.ల నుంచి 191 కి.మీ.ల వరకు రూ.133.51 కోట్ల పనులు చాలా చోట్ల పెండింగ్‌లో పెట్టారు. అదే విధంగా రూ.122.09 కోట్లు కేటాయించిన 191 కి.మీ.ల నుంచి 234 కి .మీ.ల (తాడికల్ నుంచి కేయూ క్యాంపస్ సమీపం) వరకు కూడా పనులు చేయలేదు. ఆరేళ్లుగా కాల్వల్లో నీటి ప్రవాహం ఉందని కారణంగా కాలయాపన చేసిన అధికారులు, కాంట్రాక్టర్లు.. సరిగ్గా వానాకాలం ఆరంభానికి ముందు.. పదిహేను రోజుల కిందట మళ్లీ పనులు మొదలెట్టడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పనులు చేసేందుకా?.. గతంలో లాగే కాజేసేందుకా? అన్న చర్చ జరుగుతోంది.



తూతూ మంత్రంగా..సాగుతున్న హనుమకొండ యాదవనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వల ఆధునికీకరణ పనులు

డీబీఎం–38,48 పనులపై సాగుతున్న 'విజిలెన్స్'విచారణ...

వరంగల్ జిల్లాలోని ఎస్ఆర్ఎస్‌పీ, డీబీఎం 48 సీసీహెచ్ డివిజన్ నంబర్ 4 పరిధిలోని తీగరాజుపల్లి, పర్వతగిరి, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం జిల్లాలోని తీర్థాల వరకు ఆధునికీకరణ పనుల కోసం రూ.123కోట్లు కేటాయించారు. ఈ నిధులతో డీబీఎం 48, 1ఆర్ 2ఎల్, 3ఎఆర్, 6ఎల్, 10ఆర్, 1,13 ఆర్, 16 ఆర్, 17 ఎల్, 21ఆర్, 24 ఆర్, 25 ఎల్, 26 ఎల్, 27 ఎల్, 28 ఆర్, 29 ఎల్, 30 ఆర్, 31 ఎల్, 32 ఎల్, 34 ఆర్, 35 ఎల్, 26 ఆర్, 38 ఆర్ ఉప కాల్వల అభివృద్ధి, ఎర్త్ వర్క్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే, ఈ పనులు చేయకుండానే కాంట్రాక్టర్లు, అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై దాదాపు రూ.17 కోట్ల పనులు జరిగినట్లుగా బిల్లులు రికార్డు చేసుకొని, డబ్బులు డ్రా చేసుకున్నారన్న ఫిర్యాదులపై ప్రభుత్వం ఆదేశించిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ ఇంకా సాగుతోంది. డీబీఎం 38 ప్యాకేజీ పనులు గీసుకొండ, మల్లంపల్లి, పరకాల వరకు రూ.123 కోట్ల అంచనా వ్యయంతో డోవెల్ బ్యాంకింగ్, సీసీ లైనింగ్, ఇన్‌స్పెక్షన్ పాత్‌ల అభివృద్ధి కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగంపైన విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో ఆరేళ్ల పెండింగ్‌లో ఉన్న పనులను వర్షాకాలం ముందు ప్రారంభించడం వల్ల మళ్లీ నాసిరకం పనులతో నిధులు కాజేసే అవకాశం ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి.

కాల్వల్లో నీరుండడం వల్లే ఆలస్యం..

2018 జనవరిలో పనులు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి కాల్వల్లో నీళ్లు ఉండటం వల్లే ఆలస్యం జరిగింది. రూ.122.09 కోట్ల వ్యయంతో 191–234 కిలోమీటర్లు వరకు చేయాల్సిన పనులకు గాను 202 కి.మీ.ల వరకు పూర్తయ్యాయి. చివరి ఆయకట్టు వరకు ప్రతి ఎకరానికి నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ప్రస్తుతం 202–234 కి.మీ.ల వరకు పనులు చేపట్టారు. నాణ్యతాప్రమాణాల ప్రకారం పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– కె.సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ

రీ-ఆర్గనైజేషన్ వల్ల ..

కాకతీయ ప్రధాన కాల్వల పునరుద్ధరణ పనుల పూర్తికి నీటి ప్రవాహంతో పాటు నీటి పారుదల శాఖ రీ-ఆర్గనైజేషన్ కారణంగా ఆలస్యమైంది. ఏఈఈలు మొదలు చీఫ్ ఇంజనీర్ల వరకు మారి, కొత్త వాళ్లు వచ్చారు. ఈ వానాకాలంలోనైనా చివరి ఆయకట్టుకు నీరందాలంటే ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జూలై నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని మొదలు పెట్టాం. వర్షాల ఉధృతి పెరగకముందే పూర్తి చేస్తాం.

– సునీత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జలవనరులశాఖ

పథకం పేరు: ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వల ఆధునికీకరణ

మొత్తం పనులు:	83
మంజూరైన నిధులు:	రూ.873.61 కోట్లు
పనులు ప్రారంభం:	2018 జనవరి
స్థిరీకరించిన ఆయకట్టు :	13.70 లక్షల ఎకరాలు

గార్ల ఎంపీపీపై దాడి

● 16 మందిపై కేసు



ఎంపీపీపై దాడి చేస్తున్న రాంసింగ్ అనుచరులు

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల ఎంపీపీ ఎం శివాజీచౌహాన్‌పై దాడికి పాల్పడిన ఘటనలో 16 మందిపై గురువారం కేసులు నమోదయ్యాయి. ఎస్సై వెంకన్న కథనం ప్రకారం మండలంలోని పెద్దకిష్టాపురానికి చెందిన జీ రాంసింగ్ బుధవారం రాత్రి తిర్లాపురంలోని బంక్‌కు వెళ్లి పెట్రోల్ పోయించుకున్నారు. అనంతరం పెట్రోల్ బాయ్ సాయికి రూ. 2వేల నోటు ఇవ్వగా, తమ యజమాని రూ.2వేల నోటు తీసుకోవద్దన్నాడని.. ఫోన్‌పే చేయమని కోరాడు. దీంతో రాంసింగ్..రూ. 2వేల నోటు ఎందుకు తీసుకోవంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కారును మూవ్ చేశారు. ఈ క్రమంలో కారు ఆపమని డోర్ పట్టుకున్న సాయి కాలుకు తీవ్రగాయాలయ్యాయి. పెట్రోల్ బాయ్ కేకలు వేయడంతో గ్రామస్తులు రాంసింగ్ కారును ఆపారు. ఈలోపు పెట్రోల్ కోసం వచ్చిన ఎంపీపీ శివాజీ చౌహాన్ విషయం తెలుసుకుంటుండగా ఎంపీపీపై కూడా రాంసింగ్ దురుసుగా ప్రవర్తించడంతో ఎంపీపీ మందలించాడు. దీనిని దృష్టిలో ఉంచుకున్న రాంసింగ్ గురువారం ఉదయం తన అనుచరులతో గార్లకు వచ్చి ఎంపీపీపై దాడి చేశారు. ఈ దాడిలో ఎంపీపీతో పాటు అతని తమ్ముడు, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఎంపీపీ ఫిర్యాదు మేరకు రాంసింగ్‌తో పాటు అతని అనుచరులు 16 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపాడబోయి.. కనిపించని లోకాలకు..

● విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం



కొమ్మయ్య మృతదేహం

సంగెం: ఇనుప దండెంపై తడిబట్టలు ఆరవేస్తున్న మహిళకు కరెంట్ షాక్ తగలడంతో ఆరుపులు విని కాపాడబోయి అదే తీగ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కాపులకనిపర్తికి చెందిన సదిరం కొమ్మయ్య(57) ఇంటి ఎదుట గల ఇనుప దండెంపై పక్కంటికి చెందిన సదిరం రమ తడి బట్టలు ఆరవేస్తోంది. ఈ క్రమంలో దండెంకు కరెంట్ సరఫరా వచ్చి రమ విద్యుదాఘాతానికి గురై కేకలు వేసింది. అక్కడే ఉన్న కొమ్మయ్య రమ విడిపించే ప్రయత్నంలో దండెంకు తగలగా విద్యుత్ షాక్‌క గురై అక్కడిక్కడే మృతి చెందాడు. రమ తీవ్రగాయంతో స్పృహతప్పి పడిపోయింది. రమను 108లో ఎంజీఎంకు తరలించారు. మృతుడి కుమారుడు సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

'గీతం'లో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు

● యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఉదయకుమార్

హన్మకొండ అర్బన్ : జాతీయ విద్యా విధానం–2020 అమలులో భాగంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2023–2024 విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల డిగ్రీ (హానర్స్) కోర్సులను ప్రారంభిస్తున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ సి.ఉదయకుమార్ తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలోని సుప్రభ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కోర్సులు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయన్నారు. ఈ నాలుగేళ్ల కోర్సుల ద్వారా విద్యార్థులు క్లిష్టమైన సమస్యలకు పరిష్కారం, విమర్శనాత్మక ఆలోచన, భావ ప్రకటన నైపుణ్యాలతో పాటు, కళలు, మానవీయ శాస్త్రాలు, మేనేజ్‌మెంట్, సైన్స్‌లోని అంతర్ విభాగ పాఠ్యాంశాలను అభ్యసించొచ్చని తెలిపారు. గీతం నూతనంగా తీసుకువస్తున్న లిబరల్ ఎడ్యుకేషన్ (ఉదార విద్య) ద్వారా విద్యార్థులు బీఏ, బీబీఏ, బీఎస్సీలలో దేనిలో చేరినా మొదటి సెమిస్టర్‌లో మొత్తం ఒకేరకమైన పాఠ్యాంశాలను అభ్యసిస్తారని, రెండో సెమిస్టర్‌లో విద్యార్థులు కావాలనుకుంటే ఈ మూడింటిలో ఒకదానిలో నుంచి మరో కోర్సుకు మారవచ్చన్నారు. దేశంలో 19 కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో సహా 105 వర్సిటీలలో ఈ విద్యా సంవత్సరం నుంచి నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు ప్రారంభంకానున్నట్లు తెలిపారు. అందులో గీతం కూడా ఒకటి ఆయన తెలిపారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మూగ యువకుడి మృతి

● వైద్యుల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ



వంశీ మృతదేహం

జనగామ రూరల్ : జ్వరంతో బాధపడుతున్న ఓ మూగ యువకుడిని చికిత్స నిమిత్తం జనగామలోని ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చిన కొద్ది గంటలలోనే మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం మండలంలోని ఓబుల్‌కేశావాపూర్‌కు చెందిన కర్రె వంశీ (18) జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు గురువారం ఆస్పత్రికి తీసుకురాగా మొదట ఈసీజీ తీసిన వైద్యులు.. అనంతరం అడ్మిట్ చేసుకున్నారు. ఉదయం 11 గంటలకు వైద్యం చేస్తుండగా మృతి చెందాడు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి..

ఉదయం 8 గంటలకే ఆస్పత్రికి తీసుకొచ్చినా 11 గంటల వరకూ వైద్యం చేయకపోవడంతోనే ఆరోగ్య పరిస్థితి విషమించి వంశీ మృతి చెందాడని, దీనికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువులు ఆరోపించారు. 11.30 గంటలకు ఇంజక్షన్ ఇచ్చిన తరువాత 11. 45 గంటలకు మృతి చెందాడని వైద్యులను నిలదీశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్ రాజును వివరణ కోరగా వంశీకి ఆస్పత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా వెంటనే వైద్యం అందించారని తెలిపారు.

చంద్రయ్యపల్లిలో చికిత్స పొందుతున్న యువకుడు..



అనిల్(ఫైల్)

నల్లబెల్లి: అజాగ్రత్తతో బైక్ నడిపిన ఓ యువకుడు.. గైడ్ పోస్టును ఢీకొని వాగులో పడ్డాడు. దీంతో తీవ్రగాయాలుకాగా స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దుగ్గొండి మండలం చంద్రయ్యపల్లికి చెందిన పాండవుల రమణమ్మ, రాజన్న దంపతుల కుమారుడు అనిల్(24) నల్లబెల్లి రెడ్‌మిక్స్ ప్లాంట్‌లో జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం శనిగరం క్రాస్‌లో వ్యక్తిగత పనులు ముగించుకున్న అనిల్.. బైక్‌పై నల్లబెల్లి వైపు వస్తూ అజాగ్రత్తతో మధ్యలవాగు గైడ్ పోస్టును ఢీకొన్నాడు. దీంతో బైక్‌తో సహా వాగులో పడిపోగా తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేశ్ తెలిపారు.

కంచనపల్లిలో మరో యువకుడు..



రమేశ్(ఫైల్)

రఘునాథపల్లి: అకారణంగా భార్య కేసు పెట్టిందని మనస్తాపానికి గురైన భర్త.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కంచనపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన కొడగాని రమేశ్ (28)కు అదే గ్రామానికి చెందిన కాంటివాడ పెద్ద సోమయ్య కూతురు సునీతతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఏడాది క్రితం దంపతులు హైదరాబాద్‌కు వలస వెళ్లారు. అక్కడ గొడవలు జరగడంతో భార్య సునీత.. భర్త పై ఉప్పల్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మనోవేదనకు గురైన రమేశ్ కంచనపల్లికి వచ్చి తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఆయన బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే జనగామ వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రైతులకు పైసా పరిహారం ఇవ్వలే..

● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న కోదండరాం

ఎస్ఎస్ తాడ్వాయి: ఈ ఏడాది ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.11 వేల పరిహారం చెల్లిస్తానని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటి వరకూ పైసా ఇవ్వలేదని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. దివంగత ప్రొఫెసర్ జయశంకర్ స్వగ్రామం అక్కంపేట నుంచి చేపట్టిన 'తెలంగాణ బచావో' యాత్ర గురువారం మేడారంలో ముగిసింది. యాత్ర ముగింపు పార్టీ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరుగు పేరుతో రైతులను దోపిడీకి గురిచేయడంతో వారు ఎక్కడపడితే అక్కడ తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో ఓటర్లకు మద్యం, పైసలు ఇచ్చి ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. ప్రజా సంక్షేమం కోసం ఈ యాత్ర చేపడుతున్నామన్నారు. మేడారం జాతర అభివృద్ధికి కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వం.. మేడారానికి సమీపంలోనే ఉన్న ఎల్బాక గ్రామంలో చిన్న లోలెవల్ కాజ్‌వే కూడా నిర్మించలేదని మండిపడ్డారు. ఈ జాతర అభివృద్ధిపై ప్రజలతో కమిటీ వేసి పనుల నాణ్యతను పర్యవేక్షిస్తామన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్.. వచ్చే ఎన్నికల్లో పైసా ఖర్చు పెట్టకుండా గెలుస్తామని చెప్పారని, అదే సవాల్‌గా తీసుకుని ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శంకర్‌రావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, జేఏసీ జిల్లా చైర్మన్ చాప బాబు దొర, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

● ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

లింగాలఘణపురం: పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఈ నెల 27వ తేదీలోపు స్పష్టమైన వైఖరి ప్రకటించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి చేపట్టిన బస్సు యాత్ర గురువారం మండలంలోని పటేల్‌గూడెం సమీపంలోని గుడిసెవాసుల వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా గుడిసెవాసుల కాలనీకి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కాచం కృష్ణమూర్తి నగర్‌గా నామకరణం చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వీరయ్య మాట్లాడారు. ఇళ్లులేని పేదలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుంటే ప్రధాన రోడ్డుకు పక్కనే ఉన్నాయని, కోట్ల విలువైన భూమిని ఎందుకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. పేదలకు రోడ్ల వెంట ఇళ్లు అవసరంలేదా.? కొండలు, గుట్టల్లోనే ఉండాలా అంటూ ప్రశ్నించారు. పేదలకు ఇళ్ల స్థలాలు కావాలంటూ ఏడాది నుంచి పోరాడుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 ప్రాంతాల్లో భూపోరాటం సాగుతుందని, ఈ నెల 18న చేపట్టిన బస్సు యాత్ర 27వ తేదీన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగుస్తుందని, అప్పటి వరకు ఇళ్లు, ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, బస్సు యాత్ర బృందం నేతలు పద్మ, జగదీశ్, శోభన్, ఆనంద్, కనకారెడ్డి, రాజు, చందు, యాదగిరి, సోమయ్య, గోపి, శ్రీనివాస్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వరంగల్ పార్లమెంట్ అధ్యక్షుడిగా విద్యాసాగర్‌రావు

● 17మందితో కమిటీ ఏర్పాటు

వరంగల్: టీడీపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గురువారం జాబితాను విడుదల చేశారు. పార్లమెంట్ కమిటీ అధ్యక్షుడిగా అర్శనపల్లి విద్యాసాగర్ రావు (వరంగల్ పశ్చిమ), ఉపాధ్యక్షుడిగా జీఎల్ శ్రీధర్ (వరంగల్ తూర్పు), రెగూరి వెంకట్‌రెడ్డి(పరకాల), బర్ల యాకూబ్ (వరంగల్ పశ్చిమ), ప్రధాన కార్యదర్శులుగా నల్లకుంట రవికుమార్ (వరంగల్ తూర్పు), చొల్లేటి కృష్ణారెడ్డి(స్టేషన్ ఘనపూర్), అధికార ప్రతినిధులుగా గంగబోయిన రవీందర్ (పరకాల), బొలగాని చిత్తరంజన్ (పాలకుర్తి), కార్యాలయ కార్యదర్శిగా పిట్టల శ్రీనివాస్ (వర్ధన్నపేట), కోశాధికారిగా కాగితాల జయశంకర్ (వరంగల్ పశ్చిమ), కార్యనిర్వాక కార్యదర్శులుగా రేగుల సదయ్య(పరకాల), మాచర్ల నగేశ్(భూపాలపల్లి), కార్యదర్శులుగా హరిదాస్యం సురేశ్(వరంగల్ తూర్పు), లాడే రవీందర్(పరకాల), కేదాసి స్వామి (పరకాల), తాటికాయల అనిల్(వర్ధన్నపేట), మాడగాని మనోహర్(వరంగల్ పశ్చిమ) నియమితులయ్యారు. పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణను పరిగణలోకి తీసుకొని ముఖ్య నాయకులతో చర్చించి పూర్తిస్థాయి పార్టీ కమిటీని ఎంపిక చేశామని జ్ఞానేశ్వర్ తెలిపారు.